ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు

- ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ వెల్లడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీని నియమించింది. ఈమేరకు గురువారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ వెల్లడించారు. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కె పుష్పలీల, ఎస్ రాములనాయక్, ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, దివ్యవాణి చౌదరి, కత్తి వెంకటస్వామి సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ శుక్రవారం తొలిసారి భేటీ కానుంది.

ఎఇ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఇంజనీరింగ్ శాఖలకు చెందిన విభాగాల్లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఎఇ), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్ అండ్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించి ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) విడుదల చేసింది. ఈ మేరకు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనరల్ ర్యాంకింగ్ జాబితా (జిఆర్‌ఎల్)ను ప్రకటించామని అందుకు సంబంధించిన వివరాలు ష్ఠష్ఠ.¯ంజూంఎ. స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని సూచించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం మెరిట్ జాబితాను రూపొందిస్తామని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని 837 ఎఇ పోస్టుల భర్తీకి 2022 సెప్టెంబర్ 12న టిఎస్‌పిఎస్‌సి నోటిఫికేషన్‌ను తెలిసిందే.

బిజెపి గెలిస్తే రిజర్వేషన్లు ఉండవు

- ఆర్‌ఎస్‌ఎస్ విధానాన్నే పార్టీ అమలు చేస్తుంది
- ఒబిసిలకు రిజర్వేషన్లు ఇస్తామంటే బిజెపికి భయం పట్టుకుంది
- బిజెపిపై చార్జిషీట్ విడుదల కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లు రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. లోక్‌సభలో 400 సీట్ల భారీ మెజార్టీ సాధించడం ద్వారా రిజర్వేషన్లు రద్దు చేసే ఆలోచనతో ఉందని చెప్పారు. రిజర్వేషన్ల కొనసాగించాలనేది కాంగ్రెస్ నిర్ణయమనీ, దాన్ని అడ్డుకునేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. రిజర్వేషన్లు కొనసాగించాలా? వద్దా? అనేది ఈ ఎన్నికల్లో రిఫరెండం అని తెలిపారు. తమ పార్టీ ఒబిసిలకు రిజర్వేషన్లు ఇస్తామంటే బిజెపికి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో 'నయవంచన- పదేండ్ల మోసం...వందేండ్ల విధ్వంసం' అంటూ బిజెపిపై నాలుగు పేజీల చార్జిషీట్‌ను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, జగ్గారెడ్డి, నాయకులు జి.నిరంజన్‌తో కలిసి సిఎం రేవంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణన చేపట్టి దేశాన్ని ఎక్స్‌రే తీస్తామంటూ రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రిజర్వేషన్ల వర్గీకరణ కోరుకునే కొంత మంది నేతలు బిజెపికి ఎందుకు మద్దతు ఇస్తున్నారో, వారికి ఓటు వేయాలని ఎందుకు కోరుతున్నారో అర్థం కావడం లేదంటూ మందకృష్ణనుద్దేశించి పరోక్షంగా చురకలంటించారు. తాత్కాలిక ప్రయోజనాల కోసం బిజెపి వైపు నిలబడొద్దని హితవు పలికారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం, బిజెపి విధానం రిజర్వేషన్లు రద్దు చేయడమేనన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనను దేశంపై రుద్దేందుకు ఆ పార్టీ కుట్ర చేస్తోందని విమర్శించారు. వందేండ్లలో రిజర్వేషన్లు రద్దు చేస్తామంటూ ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిన రోజే నిర్ణయించుకుందని తెలిపారు.

రిజర్వేషన్లు కావాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలి

ఒబిసి రిజర్వేషన్లు 27 శాతాన్ని 50 శాతానికి పెంచుతామంటూ రాహుల్‌గాంధీ ప్రకటించడంతో బిజెపికి వెన్నులో వణుకు మొదలైందని చెప్పారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచుతామని ఆయన హామీ ఇచ్చారని వివరించారు. మండల్ ఉద్యమానికి వ్యతిరేకంగా బిజెపి కమండల్ ఉద్యమాన్ని తెచ్చిందని గుర్తు చేశారు. బిజెపికి వేసే ప్రతి ఓటు రిజర్వేషన్ల తీసేయడానికి ఉపయోగపడుతుందని హెచ్చరించారు. రిజర్వేషన్లు ఉండాలనుకునేవారు కాంగ్రెస్‌కు ఓటేయాలని, వద్దు అనేవాళ్లు బిజెపికి ఓటేయాలని రేవంత్ సూచించారు.

మోడీ చేసిన అప్పులే ఎక్కువ

దేశంలో గత 14 మంది ప్రధానుల కంటే మోడీ చేసిన అప్పులే ఎక్కువ అని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. పదేండ్లలో రూ 113 లక్షల కోట్ల అప్పులు తెచ్చి దేశాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. దేశ ప్రజలపై రూ 168 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని వాగ్దానం చేశారు. కేవలం ఏడు లక్షల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారన్నారు. మోడీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకమన్నారు. రైతు పోరాటంతో నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్న ప్రధాని...పార్లమెంటు సాక్షిగా అన్నదాతలకు క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తోందన్నారు. చేనేత నుంచి కుటీర పరిశ్రమ వరకు జిఎస్‌టి పేరుతో దోపిడీకి పాల్పడుతోందన్నారు. అగ్గిపెట్టె, సబ్బు బిళ్ల, కడ్డీ కవితకర్రం అన్నట్టు వివరకు అగరబత్తీలపై కూడా జిఎస్‌టి వేసిందన్నారు. 60 ఏండ్లలో కాంగ్రెస్ కూడబెట్టిన ఆస్తులను పదేండ్లలో కార్పొరేట్లకు మోడీ కట్టబెట్టారని విమర్శించారు. విదేశాల నుంచి నల్లధనం తెస్తానన్న ప్రధాని పది పైసలు కూడా తేలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారులు అన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అమ్మేశారని విమర్శించారు.

BEFORE THE MORTOR ACCIDENT CLAIM TRIBUNAL CUM XXV ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD
MVOP No. 1009 of 2023

Between :
1. H. Lalitha, W/o. Late H. Jangaiah aged about 42 years, Occ: House wife,
2. H. Srilatha, D/o. Late H. Jangaiah, aged about 23 years, Occ. Student R/o. All are R/o. 2-1-392/1/4/3, Nallakunta, Hyderabad.
... Petitioner

To, AND
Shree Vaibhav Logistics, Prop. Srinivas Tadakamadla, S/o. Laxmaiah, aged Major, Occ Business, R/o. P. No. 56, Kamala Nagar, Medipally (V), Medipally, Telangana (Owner of Lorry bearing No. **TS 08 UE 6909.**

NOTICE

Please take notice that the above **MVOP No. 1009 of 2023** is filed against you and others for grant of compensation and the above case is posted for your appearance on **12-06-2024** at **10-30** a.m. in person or by an advocate failling which the case will be decided on merits in your absence.

// BY THE ORDER OF THE COURT //

G. GOWRI SHANKAR
Advocate
H.No. 16-2-147/38, Anand Nagar, Behind Charmas, Malakpet, Hyderabad.

వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి

- దక్షిణ తెలంగాణ జిల్లాలపై ప్రభావం
- వచ్చే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎండలు మండిపోతున్నాయి. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. గురువారం కూడా రాష్ట్రంలో పలుచోట్ల 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు దాటాయి. వచ్చే వారం రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముంది. ఒకటిరెండు మినహా అన్ని జిల్లాల్లోనూ గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోయాయి. మరోవైపు వేడిగాలుల తీవ్రత పెరిగింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి ఏడెనిమిది గంటల వరకు వేడిగాలులు వీస్తున్నాయి. దీనికితోడు ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఇంట్లో ఫ్యాన్లు, కూలర్లు పెట్టుకున్నా వేడిగాలులే వస్తున్న పరిస్థితి. 26 నుంచి 29 తేదీ వరకు రాష్ట్రంలో నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. అదే సమయంలో పలు జిల్లాల్లో ఒకటిరెండు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని సూచించింది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సొసైటీ (టిఎస్‌డిపిఎస్) నివేదిక ప్రకారం గురువారం ఉదయం 8:30 నుంచి రాత్రి 10:00 గంటల వరకు రాజన్నసిరిసిల్లలోని గంభీరావుపేట, వికారాబాద్ జిల్లా మర్పల్లిలో తేలికపాటి వర్షం కురిసింది. నేలకొండపల్లి (ఖమ్మం)45.0 డిగ్రీలు, నిడమనూరు(నల్లగొండ) 45.0, మాడ్గులపల్లి44.9, పమ్మి(ఖమ్మం) 44.9, యానంబైలు(భద్రాద్రి కొత్తగూడెం) 44.9 డిగ్రీలు నమోదయ్యాయి.

విద్యాబోధనలో ఆధునీకరణ అవసరం

- టీచర్స్ వర్క్‌షాప్‌లో ప్రముఖ కవి సుద్దాల

'ప్రశ్న అభివృద్ధికి సూచిక. అది తెలివిని పెంచుతుంది. ఆ ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వలేనప్పుడే మనిషిలో అసహనం, విసుగు, ఆక్రోశం పెరుగుతుంది' అని ప్రముఖ కవి సుద్దాల అశోక్ తేజ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో 'విద్యా బోధనలో నిరంతరం ఆధునికతను అందుకుందాం' అనే అంశంపై ఉపాధ్యాయుల వర్క్‌షాప్‌ను బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షులు మమత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ తేజ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బహుముఖ ప్రజ్ఞాశాలులుగా ఉండాలని సూచించారు. విద్యార్థుల హావ భావాలను అర్థం చేసుకోవాలన్నారు. వాస్తవానికి పిల్లల్లో ఉపాధ్యాయులకు ఎన్నో విషయాలు నేర్పిస్తారని వివరించారు. ఒక కార్యం వెనుక అనేక కారణాలుంటాయని, ఆ కారణాలను అర్థం చేసుకునే చైతన్యాన్ని ఉపాధ్యాయులు అలవర్చుకోవాలని చెప్పారు. 'తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్దేశించబడుతుంది' అని చెప్పిన కోఠారి మాటల్లో అర్థాన్ని ఒడిసి పట్టుకోవాలని సూచించారు. పిల్లవాడికి ఏ రూపంలో చెబితే ఆ పాఠ్యాంశంలోని సారాన్ని గ్రహించగలడన్న విషయాలు ..ముందు మనకు అర్థం కావాలన్నారు. అందుకే ఉపాధ్యాయులు బహుపాత్రలు పోషించే టీచర్‌గా అభివృద్ధి కావాలన్నారు.. ఉపాధ్యాయుల హావభావాలు, బాడీలాంగ్వేజ్‌తో పాటు విద్యార్థులను సక్రమమైన మార్గంలో తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్టేట్ స్కూల్ చైర్మన్ వాసిరెడ్డి అమర్‌నాథ్, అనురాగ్ యూనివర్శిటీ డైరెక్టర్ శ్రీనివాస్, బాలోత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎస్ సోమయ్య, ఉపాధ్యక్షులు సుజావతి, రూప, జి బుచ్చిరెడ్డి, నాయకులు పద్మ, గీతారాణి, నవీన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence
లారస్ ల్యాబ్స్ లిమిటెడ్
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య: L24239AP2005PLC047518
రిజిస్టర్డ్ ఆఫీస్: లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా - 531 021, ఆంధ్రప్రదేశ్.
కార్పొరేట్ ఆఫీస్: 2వ అంతస్తు, సెరిన్ టవర్స్, రోడ్ నెం. 7, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ.
Phone: +91 40 6659 4333; Fax: +91 40 6659 4320
Email: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com

రికార్డు తేది ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 91 యొక్క నిబంధనలు మరియు రూల్స్ మరియు ది సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్స్ 42&43 అనుసరించి, ఏప్రిల్ 25, 2024న నిర్వహించబడిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఆర్థిక సం॥ 2023-24 కొరకు ప్రతి వాటా ముఖ విలువ రూ. 2/- తో వాటా ఒక్కింటికి రూ. 0.40 (20%)గా 02వ మధ్యంతర డివిడెండ్ చెల్లించుటకై వాటాదారుల అర్హత నిర్ధారించుట కొరకు "రికార్డు తేదీ"ని "మే 08, 2024"గా నిర్ణయించబడినది మరియు మే 17, 2024న లేదా తరువాత డివిడెండ్ చెల్లించబడుతుంది.
తదుపరి, ఈ ప్రకటన కంపెనీ యొక్క వెబ్‌సైటు www.lauruslabs.com వద్ద కూడా అందుబాటులో ఉంటుంది.

బోర్డు ఆదేశం మేరకు
లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరఫున
సం/- జి. వెంకటేశ్వర్ రెడ్డి
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: హైదరాబాద్
తేది: 25.04.2024

జెఇఇ మెయిన్‌లో మెరిసిన తెలుగు తేజాలు

- 56 మందికి వంద పర్సెంటైల్
- అందులో 22 మంది తెలుగు విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఎన్ఐటిలు, ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశం, ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జెఇఇ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక కోసం నిర్వహించే జెఇఇ మెయిన్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) గురువారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో మరోసారి సత్తాచాటారు. దేశవ్యాప్తంగా 56 మంది విద్యార్థులు వంద పర్సెంటైల్ స్కోర్‌ను సాధించారు. వారిలో 22 మంది తెలుగు విద్యార్థులే ఉండడం విశేషం. ఈ ఘనతను సాధించిన వారిలో తెలంగాణ నుంచి 15 మంది, ఎపి నుంచి ఏడుగురు విద్యార్థులున్నారు. ఈనెల నాలుగు నుంచి 12 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్ రెండో విడత రాతపరీక్షలకు 11,79,569 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారిలో 10,67,959 మంది హాజరయ్యారు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు జెఇఇ మెయిన్ మొదటి విడత రాతపరీక్షలకు 12,21,624 మంది దరఖాస్తు చేయగా, 11,70,048 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు విడతలకు కలిపి 14,76,557 మంది దరఖాస్తు చేస్తే, వారిలో 14,15,110 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. మొదటి విడతలో 23 మంది వంద ఎన్‌టిఎ స్కోర్‌ను సాధించారు. వారిలో పది మంది తెలుగు విద్యార్థులే ఉండడం గమనార్హం. ఇందులో తెలంగాణ విద్యార్థులు ఏడుగురు, ఏపీ విద్యార్థులు ముగ్గురున్నారు. మొదటి, రెండు విడతలకు హాజరైన విద్యార్థుల మెరుగైన స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితాను ఎన్‌టిఎ గురువారం విడుదల చేసింది. కేటగిరీల వారీగా కటాఫ్ మార్కులను కూడా ప్రకటించింది. దేశవ్యాప్తంగా 2.50 లక్షల మంది అభ్యర్థులను జెఇఇ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేసింది.

జేఈఈ మెయిన్ టాపర్ల వివరాలు

గజారే నీల్‌కృష్ణ నిర్మల్‌కుమార్- మహారాష్ట్ర, దక్షేశ్ సంజయ్ మిశ్రా-మహారాష్ట్ర, ఆరవ్ భట్-హర్యానా, ఆదిత్య కుమార్- రాజస్థాన్‌ వంద పర్సెంటైల్ సాధించిన తెలంగాణ విద్యార్థులుహుండేకర్ విదిత్, ముత్తవరపు అనూప్, వెంకట సాయితేజ మదినేని, రెడ్డి అనిల్, రోహన్ సాయి పబ్బా, శ్రీయాశస్ మోహన్ కల్లూరి కేసం చన్న బసవరెడ్డి, మురికినాటి సాయి దివ్యతేజ రెడ్డి, రిషి శేఖర్ శుక్లా, తవ్వ దినేష్ రెడ్డి, గంగ శ్రేయాస్, పొలిశెట్టి రితిక్ బాలాజీ, తమటం జయదేవ్ రెడ్డి, మావూరు జస్విత్, దొరిసాల శ్రీనివాసరెడ్డి

వంద పర్సెంటైల్ సాధించిన ఎపి విద్యార్థులు

చింటు సతీష్ కుమార్, షేక్ సూరజ్, మకినేని జిష్ణుసాయి, తోటంశెట్టి నిఖిలేష్,అన్నరెడ్డి వెంకట తనీష్‌రెడ్డి, తోట సాయికార్తీక్,మురసాని సాయి యశ్వంత్‌రెడ్డి

రేపటినుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు

జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కులు సాధించిన 2.50 లక్షల మంది అభ్యర్థులు అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత సాధించారు. శనివారం నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. వాటి సమర్పణకు వచ్చేనెల ఏడో తేదీ వరకు గడువున్నది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తున్నది. వచ్చేనెల 17 నుంచి 26 వరకు అడ్మిట్ కార్డులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. వచ్చేనెల 26న ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలను నిర్వహిస్తారు. జూన్ తొమ్మిదిన జేఈఈ అడ్వాన్స్‌డ్ రాతపరీక్షల ఫలితాలను విడుదల చేస్తారు.

రాష్ట్రంలో ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

- బరిలో 547 మంది అభ్యర్థులు
- ఖమ్మంలో అత్యధికంగా 29 నామినేషన్లు దాఖలు
- నేడు పరిశీలన, ఉపసంహరణ ఒ29 వరకు గడువు
- మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల పర్వం మొదటి అంకమైన నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. చివరి రోజు ప్రధాన పార్టీల నేతలు, వారి, డమ్మీలు, ఇతర ముఖ్యులతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. రాష్ట్రంలోని17 పార్లమెంట్ నియోజక వర్గాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీకి గురువారం సాయంత్రం గడువు ముగిసే సమయానికి 547 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఖమ్మం లోక్‌సభకు అత్యధికంగా 29 నామినేషన్లు దాఖలు కాగా అదిలాబాద్ స్థానానికి అత్యల్పంగా ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి ఆరు రోజుల్లో 302 మంది నామినేషన్లు దాఖలు చేయగా, చివరి రోజు ఏకంగా 145 మంది నామినేషన్లు దాఖలు చేశారు.ఈ నెల 18 నుంచి 25 వరకు ఏడు పనిదినాల్లో నామినేషన్లను స్వీకరించారు. శుక్రవారం నామినేషన్లను పరిశీలిస్తారు. ఉపసంహరణ గడువు ఈ నెల 29 మధ్యాహ్నంతో ముగియనుంది. తర్వాత పోటీలో నిలబడేవ తుది అభ్యర్థులను ఎన్నికల సంఘం ప్రకటించనుంది. దేశ వ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. నాలుగో దశలో రాష్ట్రంలో మే 13న పోలింగ్ జూన్ 4న కౌంటింగ్, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల

- మే 2న నోటిఫికేషన్, 27న పోలింగ్
- జూన్ 5న ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. ఈ ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ మే 2న జారీ కానుంది. నోటిఫికేషన్ విడుదలైనాటి నుంచి మే 9 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. మే 10న వాటిని పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ మే 13 కాగా, ఉప ఎన్నికకు అదే నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 5న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజక వర్గానికి ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన సంగతి తెలిసిందే. దీంతో ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా, ఈ ఉప ఎన్నిక కోసం చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)ను కాంగ్రెస్ తన అభ్యర్థిగా ప్రకటించింది.

ఆకాష్ విద్యార్థులకు జెఇఇలో టాప్ ర్యాంకులు

హైదరాబాద్ బ్యూరో: తమ విద్యార్థులు జెఇఇ మెయిన్‌లో టాప్ ర్యాంకులు సాధించారని ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ తెలిపింది. రిషి శేఖర్ శుక్లా, మురికినాటి సాయి దివ్య తేజ రెడ్డిలు 100 పర్సంటైల్ సాధించడంతో పాటు జాతీయస్థాయిలో వరుసగా 15, 19 ర్యాంకులను సాధించారని పేర్కొంది. వీరు తెలంగాణలో స్టేట్ టాపర్లుగా నిలిచారని తెలిపింది. హైదరాబాద్‌కు చెందిన తమ ఈ ఇద్దరు విద్యార్థులు సాధించిన అసాధారణ విజయం సాధించడం సంతోషంగా ఉందని ఎఇఎస్ఎల్ బిజినెస్ హెడ్ ధీరజ్ మిశ్రా పేర్కొన్నారు.

పటాన్‌చెరు ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆగి ఉన్న బొగ్గు లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ఒకరు సజీవ దహనమైన సంఘటన ముత్తంగి రింగ్ రోడ్డుపై గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండలం బీరంగూడకు చెందిన శిరీష్ (33) వ్యాపారం చేస్తుంటారు. గురువారం ఉదయం ఐదున్నర గంటల సమయంలో వ్యాపారం నిమిత్తం రింగ్ రోడ్డుపై నుంచి హైదరాబాద్‌కు ఎర్టిగా కారులో బయలుదేరారు. ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న బొగ్గు లారీని వెనకాల నుంచి కారు ఢీకొట్టగా ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. బొగ్గు లారీకి సైతం మంటలు అంటుకున్నాయి. కారులో చిక్కుకుపోయిన శిరీష్ సజీవ దహనం అయ్యారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పి వేశారు. మృతుని అన్న కార్తీక్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence
లారస్ ల్యాబ్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 531021.
కార్పొరేట్ ఆఫీస్: 2వ అంతస్తు, సెరిన్ టవర్స్, రోడ్ నెం.7, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034, తెలంగాణ, ఇండియా.
టెలిఫోన్: +91 40 3980 4333, ఫ్యాక్స్: +91 040 3980 4320, ఇ-మెయిల్: secretarial@lauruslabs.com, వెబ్‌సైట్: www.lauruslabs.com
(CIN: L24239AP2005PLC047518)

31 మార్చి, 2024తో ముగిసిన సం॥ కొరకు లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ యొక్క ఆడిట్‌చేసిన కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాలు & మార్చి 31, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌ను అనుసరించి సిద్ధం చేయబడినవి (రూ.కోట్లలో)

క్ర.సం.	వివరాలు	త్రైమాసికం ముగింపు			సం॥ ముగింపు	
		31-Mar-24	31-Dec-23	31-Mar-23	31-Mar-24	31-Mar-23
1	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	1,439.67	1,194.92	1,380.90	5,040.83	6,040.55
2	కాలవ్యవధి కొరకు నికర లాభం (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	107.27	34.62	147.14	236.36	1,108.94
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	107.27	34.62	147.14	236.36	1,108.94
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	75.02	23.34	105.27	162.27	793.43
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం	77.28	22.29	105.36	159.40	787.80
6	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత) ఆట్రిబ్యూటెడ్					
	1) కంపెనీ యొక్క ఈక్విటీ వాటాదారులు	75.61	23.14	102.98	160.55	790.11
	2) నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్	(0.59)	0.20	2.29	1.72	3.32
7	కాలవ్యవధి ఆట్రిబ్యూటెడ్ కొరకు పూర్తి సమగ్ర ఆదాయం					
	1) కంపెనీయొక్క ఈక్విటీ వాటాదారులు	77.87	22.09	103.12	157.68	784.53
	2) నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్	(0.59)	0.20	2.24	1.72	3.27
8	ఈక్విటీ వాటా మూలధనం	107.79	107.79	107.73	107.79	107.73
9	ఆడిటెడ్ బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వులు (రివాల్యూయేషన్ రిజర్వు మినహాయించి) మరియు నాన్-కంట్రోలింగ్ ఇంట్రెస్ట్				4,003.16	3,929.80
10	వాటా ఒక్కింటికి రాబడి (రూ.2/- చొప్పున)					
	1. బేసిక్ : రూ *	1.40	0.43	1.90	2.98	14.69
	2. డైల్యూటెడ్ : రూ *	1.40	0.43	1.90	2.97	14.64

* ముగిసిన త్రైమాసికం కొరకు వార్షికం కానిది.

గమనికలు:
1. 31 మార్చి, 2024తో ముగిసిన సం॥ కొరకు ఆడిట్‌చేసిన స్టాండలోన్ ఆర్థిక ఫలితాలు మరియు మార్చి 31, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలపై అదనపు సమాచారం. (రూ.కోట్లలో)

క్ర.సం.	వివరాలు	త్రైమాసిక ముగింపు			సం॥ ముగింపు	
		31-Mar-24	31-Dec-23	31-Mar-23	31-Mar-24	31-Mar-23
1	ఆపరేషన్ల నుండి పూర్తి రెవెన్యూ	1,414.52	1,132.19	1,279.34	4,812.39	5,773.45
2	పన్నుకు ముందు లాభం	164.31	56.70	136.80	301.47	1,051.43
3	పన్ను తరువాత లాభం	121.32	42.64	102.28	223.70	760.38
4	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం	124.23	41.42	103.52	222.94	761.17

2) సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజీతో దాఖలు చేయబడిన త్రైమాసికం/ సం॥ర కాలానికి ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం పై విధంగా ఉన్నవి. త్రైమాసికం/ సం॥ర కాలానికి ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ మరియు కంపెనీ పేరు సంద www.bseindia.com, www.nseindia.com and www.lauruslabs.com సంద అందుబాటులో ఉన్నాయి.

3) ఆడిట్ కమిటీచే సమీక్షించినట్లుగా కంపెనీ యొక్క పై పేర్కొన్న ఆర్థిక ఫలితాలు ఏప్రిల్ 25, 2024 న నిర్వహించబడిన వారి సమావేశంలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.

బోర్డు ఆదేశం ద్వారా
లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరఫున
డా॥ సత్యనారాయణ చావ
పూర్తి కాలపు డైరెక్టర్ & చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: ఏప్రిల్ 25, 2024

వామపక్షాల సహకారంతో మరింత మెజార్టీ

- ఖమ్మంలో రఘురాంరెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్, కమ్యూనిస్టుల సమిష్టి కృషి : మంత్రి తుమ్మల
- లౌకిక పార్టీలతోనే దేశ భవితవ్యం : మంత్రి పొంగులేటి
- మోడీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం : రాజ్యసభ సభ్యులు రేణుకాచౌదరి
- ఇండియా వేదికలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని
- సిద్ధాంత ప్రాతిపదికన కాంగ్రెస్‌తో కలిసి పోటీ: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- బిజెపి హామీల్లో ఒక్కటీ నిలుపుకోలేదు : ఎంపి అభ్యర్థి రామసహాయం
- కాంగ్రెస్, వామపక్షాలు ర్యాలీగా రఘురాంరెడ్డి నామినేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వామపక్షాల సహకారంతో అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన మెజార్టీ కంటే కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డికి అధిక మెజార్టీ ఇస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టుల సమష్టి కృషితో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలతో పాటు రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు. గురువారం ఖమ్మం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘురాంరెడ్డి (ఆర్ఆర్ఆర్) నామినేషన్ అనంతరం కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపి, ఎమ్మెల్యేలు, వామపక్ష నేతలతో కలిసి మంత్రి తుమ్మల మాట్లాడారు. జిల్లా పార్టీ అభిప్రాయ సేకరణ తర్వాతే రఘురాంరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేశారని తెలిపారు. జిల్లా ప్రజల మనోభావాలకు తగినట్టుగా రఘురాంరెడ్డి ఎంపిగా విజయం సాధించి.. ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. సెక్యులర్ పార్టీలతోనే దేశ భవితవ్యమని రెవెన్యూ, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రఘురాంరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. ఈ దేశాన్ని గాడిలో పెట్టాలంటే సెక్యులర్ పార్టీలతోనే సాధ్యమన్నారు. రఘురాంరెడ్డి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ ఎంపి రేణుకాచౌదరి మాట్లాడుతూ.. మోడీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలు వస్తున్నాయంటే ఇడిని ప్రతిపక్షాల ఇండ్ల మీదకు ఉసిగొల్పుతున్నారని అన్నారు.

ప్రజాస్వామ్యం గుడిలోకి రాక్షసులు : ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాస్వామ్యమనే గుడిలోకి రాక్షసులు చొరబడ్డారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడినా.. మతం పేరుతో వ్యాఖ్యలు చేసినా.. జేబుసంస్థగా మారిన ఇసి మోడీపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల విధ్వంసాన్ని సాగనంపినట్టుగానే ఎన్డీఏను సైతం దేశం నుంచి తరిమివేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు జరిగిన వందకు పైగా పార్లమెంట్ సీట్లకు ఎన్నికలు పూర్తవగా.. బిజెపికి మెజార్టీ రాదని సర్వేలు చెబుతున్నాయన్నారు. అబద్దాలు చెప్పే ప్రధాని.. రాముని పేరు చెప్పి దోఖా చేస్తున్నారని అన్నారు. సిద్ధాంత ప్రాతిపదికన కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిశారని తెలిపారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్, కమ్యూనిస్టుల ఖిల్లా అని తెలిపారు.



రఘురాంరెడ్డి నామినేషన్‌కు ర్యాలీగా వెళుతున్న కాంగ్రెస్, వామపక్షాల ర్యాలీగా

ఇండియా కూటమిలో భాగంగా మద్దతు : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని

బిజెపి మతోన్మాద, ఫాసిస్టు, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా వేదికలో భాగంగానే కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్టు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. భువనగిరి పార్లమెంట్ స్థానం మినహా అన్నిచోట్లా సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన రఘురాంరెడ్డికి అభినందనలు తెలిపారు.

నేనూ ఖమ్మం జిల్లా వాసినే..: కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి రామసహాయం

తానూ ఖమ్మం జిల్లా వాసినేనని,.. తన బాల్యమంతా కూసుమంచి మండలం చేగొమ్మలో సాగిందని, అక్కడి తమ భూములు పేదలకు పంపిణీ చేశామని, ఒకప్పుడు తమ ఇంటి స్థలం, ఇంటిని అక్కడి ప్రభుత్వ పాఠశాలకు ఇచ్చినట్టు కాంగ్రెస్ ఖమ్మం ఎంపి అభ్యర్థి రామసహాయం రఘు రాంరెడ్డి తెలిపారు. రాముడు.. బిజెపి ఒక్క పార్టీకే దేవుడే కాదని, అందరివాడని అన్నారు. బిజెపి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నిలుపుకోలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తోందని, చివరకు డిఫెన్స్‌ఫోర్స్‌ను సైతం కాంట్రాక్టుకు ఇచ్చే పద్ధతి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకిప్పుడు 63 ఏళ్లని, తన పిల్లలు సెటిల్ అయ్యారని, ఈ వయసులో ప్రజా సేవ చేయడమే తన పని అని అంటూ మాటలు కాదు చేతల్లో తానేంటో చూపిస్తానని తెలిపారు. నామినేషన్‌కు ముందు స్థానిక కాల్వొడ్డు నుంచి వైరా రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు కార్లు, ఆటోలతో వందలాది మంది ర్యాలీగా తరలివచ్చారు. కాల్వొడ్డులో కాంగ్రెస్ శ్రేణులతో సిపిఎం, సిపిఐ నేతలు, కార్యకర్తలు ర్యాలీని స్వాగతించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాళోత్ రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంత్‌రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎండి జావీద్, నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, తుంబూరు దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న సిపిఎం నాయకులు

రాజకీయ వ్యాపారులను ఓడించాలి

- ప్రజా నాయకుడు సిపిఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి
- కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- చౌటుప్పల్‌లో ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ వ్యాపారస్తులను ఓడించాలి.. నిత్యం ప్రజల కోసం పనిచేసే ప్రజా నాయకుడు సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సిపిఎం అభ్యర్థి జహంగీర్ 35 ఏండ్ల నుంచి అనేక ప్రజాఉద్యమాల్లో పని చేశారన్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేసి భువనగిరి నియోజకవర్గ ప్రజలను కాలుష్యం బారి నుంచి కాపాడాలని, పంటలు, ఆహార ధాన్యాలు, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని పాదయాత్రలు, పోరాటాలు చేశారన్నారు. ఈసారి ఎన్నికల్లో అవకాశవాద కాంగ్రెస్‌ను, మతోన్మాద బిజెపిని, ఏర్పాటువాద బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి సిపిఎంకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మున్సిపాలిటీ కార్యదర్శి బండారు నర్సింహ, నాయకులు గోశిక కర్నాకర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బాలరాజు, బి.నర్సింహ, వెంకటేశం దొడ్ల అండాలు, నాగలక్ష్మి దొడ్ల శంకరయ్య, భిక్షంబాబు పాల్గొన్నారు.

రెండు లక్షల మందికి సురక్షిత బ్యాంకింగ్‌పై అవగాహన

- హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వెల్లడి

హైదరాబాద్ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో రెండు లక్షల మందికి సురక్షిత డిజిటల్ బ్యాంకింగ్ అలవాట్లపై అవగాహన కల్పించినట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. దేశ వ్యాప్తంగా 16,600 సైబర్ ఫ్రాడ్ అవేర్‌నెస్ వర్క్‌షాప్‌లను నిర్వహించినట్లు వెల్లడించింది. ఈ వర్క్‌షాప్‌లను పాఠశాల, కళాశాలల విద్యార్థులకు, చట్టాలను జారీ చేసే సంస్థలకు, సీనియర్ సిటిజన్‌లకు, స్వయం సహాయక బృందాలకు, వినియోగదారులకు మరియు ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించినట్లు తెలిపింది.

ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి లేక.. కుటుంబం గడవని పరిస్థితి.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు.. వీటి నుంచి బయటపడే మార్గ కనిపించని ఓ నేత కార్మికుడు ప్రాణం తీసుకున్నాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన అంకారపు మల్లేశం(55) చేనేత పనిచేసేవాడు. ఆయనకు భార్య భారతి, కొడుకు మహేందర్ ఉన్నారు. నెల రోజులుగా వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కురుకుపోవడంతో ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. కుటుంబ పోషణ భారంగా మారింది. ఎక్కడా పని దొరకడం లేదని తీవ్ర మనస్తాపం చెందాడు. గురువారం కూడా తంగళ్లపల్లి మండల కేంద్రంలో పలుచోట్ల పవర్ రూంలో పని కోసం పలువురిని అడిగి వచ్చాడు. పని దొరక్క పోవడంతో ఇందిరానగర్‌కు వెళ్లే దారిలో ఓ చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపానికి గురై ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిట్యాల గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ మహేష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన ఈదురు రామనర్సయ్య- సునిత దంపతులకు కుమారులు ప్రవీణ్, ప్రభాకర్, కుమార్తె ప్రవళిక(16) ఉన్నారు. గ్రామంలో తమకున్న కొద్దిపాటి పొలం సాగుతో పాటుగా, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కూతురు ప్రవళిక(16) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ (పీఎస్టీటీ గ్రూప్) చదువుతోంది. బుధవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ఆమె ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రవళిక తమ్ముడు కొంతసేపటి తర్వాత ఇంటికి రాగానే ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన అక్కను చూసి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని కిందకు దింపారు. వెంటనే కుటుంబ సభ్యులు తొర్రూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గుత్తాను విమర్శించే స్థాయి నీకెక్కడిది?

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ భేషరతుగా క్షమాపణ చెప్పాలి
- విలేకర్ల సమావేశంలో గుత్తా ముఖ్య అనుచరుల వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"సుదీర్ఘ రాజకీయ అనుభవం పరిజ్ఞానం కలిగిన మచ్చలేని మహా నాయకుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి.. మందులు అమ్ముకొని బతికిన నీచ చరిత్ర నీది.. గుత్తా గురించి మాట్లాడే అర్హత నీకెక్కడిది..? ఉస్మానియా యూనివర్సిటీలో వేలాది మంది చేసిన ఉద్యమాలను నీవే చేసినట్టు నీ ఖాతాలో వేసుకొని, వెంట నడిచిన స్నేహితులను సైతం నిలువునా ముంచింది ఎవరికి తెలియదు.. అధికారులను వేధించి.. దళిత బంధులో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డావ్.. ఇవన్నీ నిజం కాదా..?" అని గుత్తా ముఖ్య అనుచరులు మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌నుద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని గుత్తా సుఖేందర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుత్తాను విమర్శించే స్థాయిగాని, వయస్సు లేని చిల్లర వ్యక్తి గాదరి కిషోర్ అని అన్నారు. ప్రజలకు తన నీచ చరిత్ర తెలుసు కాబట్టే మొన్నటి ఎన్నికల్లో ఘోరంగా ఓడించి తరిమికొట్టారని అన్నారు. ఇసుకదందాను వృత్తిగా మార్చుకుని వందల కోట్ల రూపాయలు సంపాదించిన ప్రబుద్ధుడని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ నాయకుల ఇండ్ల చుట్టూ తిరిగి చందాలు వసూలు చేసి సొంతానికి వాడుకున్నాడని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బిఆర్ఎస్ పతనానికి ప్రధాన కారుకుడు కిషోర్ అని విమర్శించారు. తిరుమలగిరి మండలంలో దళితబంధు పథకంలో తన బినామీలకు, అనుచరులకు ఇప్పించి కోట్ల అవినీతికి పాల్పడిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తనకు అనుకూలమైన కలెక్టర్‌ను రంగారెడ్డి జిల్లాలో పెట్టుకొని కుంట్లూరు గ్రామ శివారులో భూ అక్రమ దందా చేసిన విషయం ఒక పత్రికలో ప్రచురించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఐకేపీ సెంటర్ల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని బినామి రైస్ మిల్లులకు పంపింది నిజం కాదా అన్నారు. మరోసారి గుత్తా సుఖేందర్ లాంటి వ్యక్తి మీద ఒక్కమాట మాట్లాడినా నాలుక కోసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, కనగల్ జడ్‌పిటిసి చిట్ల వెంకటేశం, బిఆర్ఎస్ సీనియర్ నేతలు ఐతగోని స్వామిగౌడ్, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి, యామా దయాకర్, హరికృష్ణ, మునాసు వెంకన్న, మాజీ జడ్‌పిటిసి సంజీవ, చిల్కరాజు శ్రీనివాస్, బకారం వెంకన్న, పిఎసిఎస్ చైర్మన్ దోటి శ్రీనివాస్, చెన్నగోని యాదగిరి, మైనారిటీ నాయకులు అనీష్ ముక్తాదర్, హన్ను ఉన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గుత్తా ముఖ్య అనుచరులు

పెద్దపల్లి బిజెపిలో కుమ్ములాట

- గుజ్జుల వర్సెస్ దుగ్యాల అనుచరుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి పెద్దపల్లి ఎంపి అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ నామినేషన్ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఘర్షణకు దిగారు. పెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి జెండా చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీలో గుజ్జుల రామకృష్ణారెడ్డి అనుచరులు, దుగ్యాల ప్రదీప్‌రావు అనుచరులకు మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. బిజెపి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డిపై గుజ్జుల రామకృష్ణారెడ్డి అనుచరులు దాడికి యత్నించారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి కార్యకర్తలను అడ్డుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

మోడీని అనర్హుడిగా ప్రకటించాలి

- కేంద్ర ఎన్నికల సంఘానికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీని ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడిగా ప్రకటించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రధానిగా వ్యవహరిస్తున్న మోడీ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వివిధ సభల్లో మాట్లాడుతున్న తీరు జుగుప్స కలిగిస్తోందని విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా పాలన చేస్తానంటూ ప్రధానిగా ప్రమాణం చేసి దానికి వ్యతిరేకంగా మతోన్మాదిగా దేశ ప్రజలను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న తీరు ఆయన ప్రధాని పదవికి మచ్చ తెస్తున్నదని తెలిపారు. రాజస్థాన్‌లోని సభలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల చర, స్థిర ఆస్తులను ముస్లిములకు పంచి పెడుతుందంటూ మోడీ వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను ఆ పార్టీ తగ్గించి ముస్లింలకు ఇస్తుందంటూ ప్రకటించారని పేర్కొన్నారు. చత్తీస్‌ఘడ్‌లో సామాజిక న్యాయం పేరుతో ప్రజల ఆస్తులను లూటీ చేసే ప్రమాదముందంటూ మోడీ మాట్లాడారని తెలిపారు. ప్రధానిగా ఉండి ప్రజల సంప బిజెపి అదానీ, అంబానీలకు దోచిపెట్టిన దాన్ని తిరిగి ప్రజల ఆస్తులుగా మారుస్తారనే భయంతోనే మోడీ ఈ మాటలు మాట్లాడుతున్నట్టు స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు. ఆయన దృష్టిలో భారత ప్రజలంటే అదానీ, అంబానీ, నీరవ్ మోడీ, విజయ్ మాల్యా వంటి కొద్ది మంది సంపన్నులు తప్ప 140 కోట్ల మంది కాదని ఎద్దేవా చేశారు. ఎన్నికల సంఘానికి ఉన్న విచక్షణాధికారాన్ని ఉపయోగించుకుని మోడీని ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మేడే రోజు కార్మికులకు సెలవు దినం ప్రకటించాలి

- లేబర్ కమిషనర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ మేడే దినోత్సవం సందర్భంగా కార్మికులకు సెలవు ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో కార్మికశాఖ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. 2023 మేడే సందర్భంగా కొన్ని సంస్థల యాజమాన్యాలు సెలవు ప్రకటించలేదనే విషయాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఈసారి రాష్ట్రంలోని పరిశ్రమలు, షాపులు, ఎస్టాబ్లిష్‌మెంట్స్ ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, ఇతర సంస్థల్లో పనిచేసే కార్మికులకు సెలవు ప్రకటించే విధంగా యజమానులకు తగిన ఆదేశాలను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లోకి మేయర్ గుండు సుధారాణి

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన జగ్గారెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ చేరికల కమిటీ ఆధ్వర్యంలో పలువురు నేతలు హస్తం గూటికి చేరారు. వరంగల్ మేయర్ గుండుసుధారాణి,మానవతారాయ్ జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీలోకి ఎవరు వచ్చినా తీసుకోవాలని ఎఐసిసి ఆదేశించిందన్నారు. సంగారెడ్డిలో తనకు వ్యతిరేకంగా పని చేసిన వారు కూడా ఇప్పుడు పార్టీలోకి వస్తానంటే కండువా కాప్పాల్సిందేనన్నారు. కాంగ్రెస్‌లో చేరుతామంటూ ఒత్తిడి పెరుగుతోందన్నారు. కొంత మంది అధిష్టానానికి ఉత్తరాలు రాస్తున్నారని తెలిపారు. త్వరలో రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సభలు ఉంటాయని చెప్పారు.

రాజీనామాలను మేధావులకిద్దాం!

- రేవంత్‌రెడ్డికి సవాల్
- రఘునందన్ రావు మాటలు నమ్మితే నీళ్లు లేని బాయిల దుంకినట్టే..
- బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించండి : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"అసెంబ్లీ ముందున్న అమరవీరుల స్థూపం వద్దకు 26వ తేదీ ఉదయం 10 గంటలకు వస్తాను.. రేవంత్ రెడ్డి దమ్ముంటే రా.. ఇద్దరి రాజీనామా పత్రాలను మేధావుల దగ్గర పెడదాం' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సిఎంకు సవాల్ విసిరారు. గురువారం మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని ధ్యాన్ చంద్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ నిర్వహించిన భారీ ర్యాలీలో జెడ్‌పి చైర్‌పర్సన్ హేమలత, ఎమ్మెల్యేలు సునితాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా ఆగస్ట్ 15 వరకు ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ అమలుచేస్తే తాను రాజీనామా చేస్తానని, అమలు చేయకుంటే రేవంత్ రెడ్డి రాజీనామా చేసేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. రాజీనామా లేఖలను ఇద్దరం మేధావుల చేతిలో పెడదామని, హామీలను అమలు చేస్తే నా రాజీనామా లేఖను మేధావులు స్పీకర్‌కు ఇస్తారని, చేయకుంటే నీ రాజీనామా లేఖను గవర్నర్‌కు ఇస్తారని స్పష్టం చేశారు. మాట మీద నిలబడే వాడివి అయితే అమరవీరుల స్థూపం వద్దకు రావాలన్నారు. రాకుంటే కొడంగల్‌లో రాజకీయ సన్యాసం తీసుకుంటానని తోక ముడిచినట్టే, ఇప్పుడు అదే అవుతుందని తెలంగాణ ప్రజలకు అర్థం అవుతుందన్నారు.

అబద్ధాలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందని ఎద్దేవా చేశారు. 1952లో బిహెచ్‌ఇఎల్ ఏర్పడిందని, కానీ స్టే ఇందిరాగాంధీ తీసుకొచ్చినట్టు రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరాగాంధీ 1980లో ఎంపి అయ్యారనే విషయాన్ని గుర్తుచేశారు. మెదక్ జిల్లా గులాబీ జెండాకు అడ్డా అని, 25 ఏండ్లుగా మెదక్ పార్లమెంటులో ప్రతిసారీ బిఆర్ఎస్ గెలుస్తుందని, ఈ సారీ భారీ మెజారిటీతో గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. మెదక్ అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు రేవంత్ రెడ్డికి లేదన్నారు. కెసిఆర్ చెక్ డ్యాంలు కట్టడం వల్ల ఒక్క ఎకరా పంట ఎండకుండా చూశారని, కానీ కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు కలెక్టరేట్, ఎస్‌పి, మెడికల్ కాలేజ్ భవనాలను, ఫోర్ లైన్ రోడ్డును కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. మెదక్ జిల్లా కోసం ఆనాడు ఎన్నో ధర్నాలు, ఆందోళన చేసి జిల్లాను సాధించుకోవడం జరిగిందని, ఇప్పుడు రేవంత్ కొత్త జిల్లాలను తీసేస్తామని అంటున్నారని తెలిపారు. 200 మంది రైతులు, 30 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు మాటలు నమ్మితే నీళ్లు లేని బాయిల దుంకినట్టే అవుతాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తేనే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలవుతాయని తెలిపారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థుల్లో ఒకాయన ఆరో తరగతి వరకు చదివారని, మరొకరు బ్లాక్ మెయిలర్ అని అన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కలెక్టర్‌గా పనిచేసిన విద్యావంతుడని తెలిపారు. సొంత డబ్బులతో ట్రస్ట్ పెట్టి పేద విద్యార్థులకు చదువుతో పాటు పెండ్లిండ్లకు ఫంక్షన్ హాల్ నిర్మించి ఇచ్చారన్నారు. ఇలా అందరికీ అందుబాటులో ఉండే వెంకట్రామిరెడ్డికి ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

ప్రచారంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి

- మరో నలుగురికి గాయాలు
- అందరూ ఒకే కుటుంబానికి చెందినవారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని దుర్గాపురం స్టేజీ వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీ కొట్టిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. మృతుల్లో ఓ చిన్నారి, ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. మరో మహిళ, ముగ్గురు చిన్నారులు ప్రమాదం నుంచి గాయాలతో బయటపడ్డారు. మృతుల్లో.. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందాపురం (ఎల్) గ్రామానికి చెందినవారు నలుగురు ఉండగా, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం చిమిర్యాలకు చెందిన మరో ఇద్దరు ఉన్నారు. చోటుచేసుకుంది. కోదాడ డిఎస్‌పి మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..

కోదాడ మండలం చిమిర్యాల గ్రామానికి చెందిన జిల్లా శ్రీకాంత్ (30), అతని భార్య నాగమణి, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీకాంత్ ఓ ప్రయివేటు వ్యక్తి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు రెండేళ్ల లావణ్య, లాస్య (4) ఉన్నారు. కాగా, లాస్యకు పుట్టెంటికలు తీయించడానికి శ్రీకాంత్ అత్తమామలు నల్లమల రామచంద్రరావు(45), మాణిక్యం (40) దంపతులు, అతని బావ కృష్ణంరాజు (25), స్వర్ణకుమారి (23) దంపతులతో పాటు వీరి కుమారులు కౌశిక్, కార్తీక్‌తో కలిసి విజయవాడలోని గుణదలకు బయలుదేరారు. కాగా, వీరందరూ హైదరాబాద్‌లోనే ఉంటూ ఇళ్లలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా, గురువారం ఐదున్నర గంటల సమయంలో కోదాడ సమీపంలోని దుర్గాపురం స్టేజీ వద్ద ఆగి ఉన్న లారీని వెనకనుండి వచ్చిన వీరి కారు.. అతివేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రామచంద్రరావు, మాణిక్యం, కృష్ణంరాజు, స్వర్ణకుమారి, శ్రీకాంత్, చిన్నారి లాస్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాంత్ భార్య నాగమణి, చిన్న కుమార్తె లావణ్య, కృష్ణంరాజు కుమారులు కౌశిక్, కార్తీక్ గాయాలతో బయటపడ్డారు. నాగమణికి తీవ్ర గాయాలయ్యాయి. తొలుత వీరిని కోదాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మంలోని కిమ్స్ ఆస్పత్రికి బంధువులు తరలించారు. కౌశిక్, కార్తీక్ కోదాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. లావణ్యకు స్వల్ప గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం బంధువులు ఇంటికి తీసుకెళ్లారు. కౌశిక్, కార్తీక్, లావణ్యకు ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, మరో ఐదు నిమిషాలు గడిస్తే చిమిర్యాల వద్ద ఉన్న శ్రీకాంత్(మతుడు) పెద్దమ్మను సైతం కారులో ఎక్కించుకొని గుణదల తీసుకుని వెళ్లాల్సి ఉంది. ఇంతలోనే ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో చిమిర్యాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎస్‌పి రాహుల్‌హెగ్డే, తహసీల్దార్ సూర్యనారాయణ, టౌన్ సిఐ రాము ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, మృతుల బంధువులను పరామర్శించారు. ఈ ప్రమాదానికి.. కారు డ్రైవర్ నిద్రమత్తులో అతివేగంగా నడపడమే కారణమని సిఐ రాము తెలిపారు. శ్రీకాంత్ సోదరుడు నందిగామ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.